క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన రామిరెడ్డి



కావలి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో కావలి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం కలిశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను జగనన్నకు వివరించినట్లు రామిరెడ్డి చెప్పారు.

మండల సమావేశం వాయిదా

వింజమూరు(ఉదయగిరి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తదుపరి ఎప్పుడు జరిగేది తెలుపుతామన్నారు.

జీవితాంతం రుణపడి ఉంటా

ఆత్మకూరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తనపై చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదని, జీవితాంతం రుణపడి ఉంటానని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో ముందస్తు పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు విచ్చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కేట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ వారం ముందుగానే తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.



కేక్ కట్ చేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఉదయగిరి : పట్టణంలోని షబ్బీర్ కాలనీ వద్ద ఉన్న ఖాజా గరీబ్‌ఖాన్ దర్గాలో గంధోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ఉత్సవాన్ని జరిపిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జిల్లా ఒకేషనల్ అధికారి సందర్శన

సంగం : స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి మమత మంగళవారం సందర్శించారు. పాఠశాలలో ఒకేషనల్ తరగతుల నిర్వహణపై హెచ్‌ఎం బుజ్జయ్యను ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

10న జాబ్‌మేళా

ఆత్మకూరు : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 91827 99405, 79016 20305 నంబర్లను సంప్రదించాలన్నారు.

రెవెన్యూ సదస్సుకు 26 అర్జీలు

సీతారామపురం : మండలంలోని పండ్రంగి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 26 అర్జీలు అందినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. వాటిలో అధిక శాతం భూముల మార్పులు, చేర్పులపై ఫిర్యాదులు వచ్చాయన్నారు.

మున్సిపల్ ఆర్డీ పరిశీలన

ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలోని స్పార్క్‌సిటీలో కొన్ని ప్లాట్లు ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసినట్లు లోకాయుక్తకు ఫిర్యాదులు అందడంతో ఏపీ పురపాలక సంఘ రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ మంగళవారం పరిశీలించారు. ఆత్మకూరు చెరువు అలుగువాగును ప్లాట్లుగా చేసి విక్రయించడంతో గత కొన్నేళ్లుగా వివాదాస్పదమైంది. కాగా ఆర్డీ మధుకుమార్ పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ సి.గంగాప్రసాద్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు నేడు

ఆత్మకూరు : విక్రమ సింహపురి యూనివర్సిటీ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరులోని ఎస్సార్‌జేడీ కళాశాల ప్రిన్సిపల్ జి.వరకుమారి, పీడీ ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల వెనుక వైపు ఉన్న మైదానంలో ఉదయం 10 నుంచి పోటీలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

అప్రమత్తత అవసరం

కలిగిరి : ఆశా కార్యకర్తలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండడం అత్యవసరమని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత తెలిపారు. కలిగిరిలోని పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం సందర్శించారు. ఈనెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే లెప్రసీ సర్వేను విజయవంతం చేయాలన్నారు. హెచ్‌ఎంపీవీ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వైద్యాధికారులు బిజ్జం గీతారెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

పంటల బీమాతో మేలు

ఆత్మకూరురూరల్ : పంటల బీమా వల్ల రైతులకు ఎంతో మేలు అని డీఏఓ సత్యవాణి అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం, పంట వీధిల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 1,500 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. ఏడీఏలు నర్సోజీరావు, ఏడీఏ శేషగిరిరావు, ఉద్యానాధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏఓ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

• సోమశిల : మండలంలోని రేవూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డీఏఓ సత్యవాణి పాల్గొని, మాట్లాడారు. మండల పరిధిలో పీఏసీఎస్‌ల ద్వారా 92 టన్నులు, రైతు సేవా కేంద్రాల ద్వారా 620 టన్నుల యూరియాను సరఫరా చేశారని తెలిపారు.

మెళకువలు పాటించాలి

సీతారామపురం : వరినాట్లు వేసే రైతులు పలు మెళకువలు పాటించాలని మండల ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మారంరెడ్డిపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలించి కత్తెర పురుగును గుర్తించారు. దీని నివారణకు సూచనలు చేశారు. ఏఈఓ సాంబశివయ్య, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి

సీతారామపురం : సీతారామపురంలో జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో విజేతలకు మంగళవారం నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను అందించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు రూ.20,116, రూ.10,116, రూ.5,116లను అందజేశారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

సంగం : ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ ఏడీ సతీష్ సూచించారు. సంగం సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం సూర్యఘర్ పథకం రిజిస్ట్రేషన్ పురోగతిపై ఏఈ మన్మథరావును అడిగి తెలుసుకున్నారు. బుచ్చి సబ్ డివిజన్ పరిధిలో సూర్యఘర్ పథకానికి సంబంధించి ఇప్పటికే 3000 రిజిస్ట్రేషన్‌లు చేశామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

ఆత్మకూరు : గీతా జ్ఞానయజ్ఞ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కె.మధుసూదన్‌శర్మ, కేవీ నాగరాజశర్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

వైద్యసిబ్బందితో సమావేశం

సంగం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్‌కుమార్ మంగళవారం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు మాస్కులు ధరించాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కనకపట్నంగా విరాజిల్లుతున్న కావలి

కావలి : జిల్లాలో రెండో పెద్ద పట్టణంగా ఉన్న కావలి రోజురోజుకు కనకపట్నంగా విరాజిల్లుతోంది. చెంతనే జాతీయ రహదారి, కూతవేటు దూరంలో రామాయపట్నం పోర్టు రానుండడంతో విద్య, వైద్యంతో పాటు ఇతర వ్యాపార రంగాలు వేగంగా పుంజుకుంటున్నాయి.

వస్త్ర రంగంలో..

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కావలిలో వస్త్ర వ్యాపారానికి ప్రత్యేక స్థానం ఉంది. వీధుల్లో వస్త్రాలను అమ్మకాలు చేసే స్థాయి నుంచి దుస్తులను సైకిల్‌పై గ్రామాల్లో అమ్మకాలు చేయడం 1975 వరకు కొనసాగింది. అనంతరం పేరెన్నిక కలిగిన దుకాణాలు ప్రారంభమయ్యాయి. అలా కావలి పట్టణం వస్త్ర వ్యాపారంలో ఉమ్మడి రాష్ట్రస్థాయిలో విశిష్టతను సంపాదించింది. ఇక్కడ సుమారు 1,500 వస్త్ర దుకాణాలు ఉన్నాయి. అలాగే రెడీమేడ్ వస్త్రాలను తయారు చేసే కేంద్రాలు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో దర్జీలు కూడా ఉన్నారు.

విద్యా రంగంలో..

విద్యాసంస్థల పరంగా కావలికి ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గుర్తింపు వచ్చింది. రెండు జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు కావలికి వచ్చి చదువుకోవడానికి ఆసక్తి చూసేవారు. దీంతో పలు రకాల విద్యా సంస్థలు, ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లు, మెస్‌లు, కర్రీస్ పాయింట్లు, అద్దె గదులు విస్తృతంగా ఏర్పాటయ్యాయి. ఇవి స్థానికులకు ఉపాధి అవకాశాలు కలిగించాయి. కావలిలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు కావడంతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు ఇక్కడికి రాసాగారు.

నిత్యావసర సరుకులకు..

కావలికి వందల సంఖ్యలో గ్రామీణ ప్రజలు తమ అవసరాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో నిత్యావసర సరుకుల దుకాణాలు, హోటల్స్, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్లు, పిజ్జా కార్నర్లు, మిఠాయిల దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి.

వాణిజ్య కూడలి

కావలిలో రోజురోజుకు జనాభా పెరుగుతుండడంతో అందుకు తగినట్లు అన్నిరకాల వైద్యసేవలు అందించేలా ఆస్పత్రులు, వివిధ కంపెనీలకు చెందిన బైక్ షోరూమ్‌లు, కార్ల షోరూమ్‌లు వెలిశాయి. దీంతో పాటు కోరిన మోడల్స్‌లో బంగారు ఆభరణాలు తయారు చేసే విధంగా బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిపుణులు ఇక్కడ ఉన్నారు. దీంతో బంగారు దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

రియల్ వ్యాపారంలో..

కావలిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనేక అంశాలు అనుకూలంగా ఉన్నాయి. చెన్నై- కలకత్తా హైవేపై ఉన్న కావలి రోజురోజుకు విస్తరిస్తోంది. అంతేకాకుండా కావలి-దుత్తలూరు మార్గాన్ని జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తుండడం, ఉత్తరం వైపు రామాయపట్నం పోర్టు, తూర్పు వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, తుమ్మలపెంట సముద్ర తీరం, దక్షిణం వైపు దామవరం వద్ద విమానాశ్రయం రూపుదిద్దుకోనున్నాయి. అంతే కాకుండా కావలిలో అనేక రైళ్లకు స్టాపింగ్ ఉండడంతో పాటు విజయవాడ, తిరుపతి, చెన్నైకి నిత్యం బస్సు సౌకర్యం ఉండడంతో అటు రవాణా, ఇటు ప్రయాణ సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. దీనివల్ల ఇతర ప్రాంతాల ప్రజలు కూడా కావలిలో స్థిరపడటానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజలకు అన్ని సౌకర్యాలకు అందుబాటులో ఉండేలా రియల్టర్లు వెంచర్స్ వేయడంతో అనేక మంది ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర





అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

అల్లూరు : అల్లూరు పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.